నాణ్యమైన విత్తనాల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

వ్యవసాయాధికారులను ఆదేశించిన వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 29 : జిల్లాలో రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వికాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఐడీవోసీ సమావేశం హాలులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు కొని రైతులు నష్టపోకుండా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సీడ్ పత్తి విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన డీలర్ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విడిగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయరాదని, సంబంధిత కంపెనీ లేబుల్ ఉన్న ప్యాకెట్లను కొనాలని తెలిపారు. కొనుగోలు చేసిన విత్తనాల ఖాళీ ప్యాకెట్లను, బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకుంటే, ఒకవేళ నకిలీ విత్తనాల కారణంగా దిగుబడి రానప్పుడు సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మేవారి గురించి రైతులు, ఇతర పౌరులు ఎవరైనా సరే సమాచారం ఇస్తే వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ యంత్రాంగం సహాయంతో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మండలాలవారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు విత్తనాల కొనుగోలుపై పూర్తి అవగాహన కల్పించాలని, టాస్క్‌ఫోర్స్ టీములు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. రైతులు ఏ కంపెనీ విత్తనాలు కొన్నారో అడిగి తెలుసుకోవాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రోగ్రామ్స్ జరగాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద చెకింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ఆర్‌డీవోలు వాసుచంద్ర, శ్రీనివాస్, ఏడీఏలు, ఏవోలు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులున్నారు.

పత్తి విత్తనాలకు ఎలాంటి కొరత లేదు

వికారాబాద్ జిల్లాలో పత్తి విత్తనాలకు ఎటువంటి కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ వానకాలంలో పత్తి 2,63,500 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశామన్నారు. దీనికి 5,45,000 విత్తనాల ప్యాకెట్లు అవసరం కాగా.. 2,58,500 ప్యాకెట్లు జిల్లాలో నిల్వ ఉండగా.. 17,500 ప్యాకెట్ల విక్రయం జరిగిందన్నారు. పత్తి విత్తనాల నిల్వలపై వివిధ కంపెనీలకు చెందిన BG II హైబ్రిడ్ రకంపై వ్యవసాయ శాఖ గ్రామాలవారీగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. BG II రకం ఏ కంపెనీదైనా.. సరైన యాజమాన్య పద్ధతులు, తగిన సమయంలో సరైన పద్ధతిలో విత్తుకోవడం, కలుపు నివారించడం, చీడపీడలు ఆశించకుండా తగిన మందులను పిచికారీ చేయటం వంటివి పాటిస్తే ఒకే విధమైన దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులు అపోహ చెందకుండా BG II రకం ఏ కంపెనీదైనా సాగు చేసుకోవలసిందిగా ఆయన కోరారు.

సమావేశానికి హాజరైన సంబంధిత అధికారులు

మట్టి మాఫియాపై ఉక్కుపాదం

- ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి
- అక్రమంగా మట్టి తరలిస్తున్న 10 టిప్పర్లు స్వాధీనం
- మైనింగ్ రెవెన్యూ అధికారులకు అప్పగింత

ఆదిబట్ల, మే 29 : అక్రమ మట్టి రవాణా ఆపకుంటే సహించేది లేదని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గత రెండు రోజులుగా అక్రమంగా మట్టి తరలిస్తున్న 10 టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్, రావిరాల, మంగల్‌పల్లి గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకుండా రాత్రి పూట కొంత మంది అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో గత రెండు రోజులుగా అక్రమంగా మట్టి తవ్వుతున్న ప్రదేశాల్లో దాడులు నిర్వహించామన్నారు. సోమవారం అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న 5 టిప్పర్లను స్వాధీనం చేసుకుని మహేశ్వరం రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు. మంగళవారం కొంగరకలాన్ గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న మరో 5 టిప్పర్లను స్వాధీనం చేసుకుని మైనింగ్ ఏడీకి అప్పగించి కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇప్పటికైనా మైనింగ్ రెవెన్యూ పర్మిషన్ తీసుకుని మట్టిని తరలించాలన్నారు. లేకపోతే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 29 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, ప్రత్యేక అధికారులు ప్రతి రోజూ 3, 4 పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేపట్టకముందు, పనులు చేపట్టిన తర్వాత పాఠశాల ఫొటోలు పంపాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజున బెలూన్స్ పెట్టి పాఠశాలలను అందంగా తీర్చిదిద్దాలని, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన తాగునీరు, మైనర్, మేజర్ రిపేర్స్, టాయిలెట్స్, విద్యుద్దీకరణ, టాయిలెట్స్ ఏర్పాటు పనుల పురోగతి, బడిబాట, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్ తదితర అంశాలపై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమూలమైన మార్పులు తెచ్చేందుకు చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులపై లక్ష్యం నిర్దేశించుకుని జూన్ 10 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనలో భాగంగా పనులు ఇప్పటివరకు ఎన్ని పూర్తయ్యాయి.. ఇంకా ఎన్ని చేపట్టవలసినవి.. ఎప్పటిలోగా పూర్తి చేస్తారో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక రూపొందించుకొని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. జూన్ 3 నుంచి పెద్దఎత్తున బడిబాట కార్యక్రమం చేపట్టాలని.. ముఖ్యంగా బడీడు పిల్లలు బడిబాట పట్టేలా ప్రధానోపాధ్యాయులు చూడాలన్నారు. మండలస్థాయిలో ఎంపీడీవోలు, ఎంఈవోలు, ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏపీఎంలు, సీసీలు, మండల ప్రత్యేక అధికారులు రెండు రోజులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, మెప్మా సిబ్బంది చూడాలన్నారు. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రాపవుట్ లేకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలల ప్రారంభం రోజున బెలూన్స్ పెట్టి పాఠశాలలను అందంగా తీర్చిదిద్దాలని, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ జరగాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, డీఈవో, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రావతరణ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

జూన్ 2న జరిగే పదో రాష్ట్ర తెలంగాణ అవతరణ దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అన్నారు. బుధవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారుల సమన్వయంతో రాష్ట్ర అవతరణ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో ఉదయం 8.30 గంటలకు పతాకావిష్కరణ జరగాలని ఆదేశించారు. 2న అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం తొమ్మిది గంటలకు కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. కలెక్టరేట్ ఆవరణలో శానిటేషన్, తాగునీరు, టెంట్లు, కుర్చీలు, డయాస్, సౌండ్ సిస్టం, విద్యుత్, పుష్పాలంకరణ, స్నాక్స్ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారికి సూచించారు. అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.

పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

పనులు వేగవంతం చేయాలి

రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

ఆమనగల్లు, మే 29 : ఈ విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఆదేశించారు. బుధవారం ఆమనగల్లు, మాడ్గుల మండలాల పరిధిలోని పోలేపల్లి (ప్రాథమికోన్నత పాఠశాల), కలకొండ (జిల్లా పరిషత్ హైస్కూల్), చంద్రాయన్‌పల్లి (ప్రాథమికోన్నత పాఠశాల) పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను మండల విద్యాధికారి సర్దార్ నాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించడం జరిగిందని, పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు పనులను పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలల్లో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

- ఉప్పరిగూడలో పర్యటించిన రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి
- రైతులకు ఎరువులు, విత్తనాలపై అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, మే 29 : రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో సరైన జాగ్రత్తలు పాటించాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉప్పరిగూడలో బుధవారం రైతులకు విత్తనాలు, ఎరువులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై ఆమె మాట్లాడుతూ.. రైతులు విత్తనాలను వ్యవసాయాధికారుల సూచనల మేరకు కొనుగోలు చేయాలని సూచించారు. లూజుగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయకూడదన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రశీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్‌తో పాటు బిల్లును పంటల కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. కల్తీ విత్తనాలు విక్రయించేవారిని ఉపేక్షించేది లేదని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మండల అధికారి వరప్రసాద్‌రెడ్డి, విస్తరణాధికారి రఘు ఉన్నారు.

పచ్చి రొట్ట విత్తనాల కొరత ఉండదు

మొయినాబాద్ : పచ్చిరొట్ట విత్తనాల కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఏవో గీతారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో 1778 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేయడానికి ప్రణాళిక రూపొందించామని చెప్పారు. గత ఏడాది కంటే సుమారు 760 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలను అదనంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గత వారం రోజుల్లో 1447 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా 330 క్వింటాళ్లను త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. జనుములు, జీనుగులు రైతులకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు సరిపడా పంపిణీ చేస్తామని.. ఎవరు కూడా అధైర్యపడవద్దని స్పష్టం చేశారు. మొయినాబాద్ మండలంలో గత ఏడాది 119 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ చేశామని, ఈ ఏడాది 263 క్వింటాళ్లు పంపిణీ చేయడానికి ప్రణాళిక చేసినట్లు తెలిపారు. మొదటి రోజు 90 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామని.. మిగతా విత్తనాలు కూడా రెండు రోజుల్లో రైతులకు అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులకు మూడు, నాలుగు రోజుల్లో పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు. రైతులకు ఈ ఏడాదికి సరిపడే ఎరువులు కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. అన్ని రకాల విత్తనాలు కూడా డీలర్ల వద్ద పెట్టామని.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. బిల్లును పంట చేతికి వచ్చే వరకు భద్రంగా దాచి పెట్టాలన్నారు. రైతులు పంటలు సాగు చేసుకుని అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందాలని ఆమె ఆకాంక్షించారు. సమావేశంలో చేవెళ్ల ఏడీఏ రమాదేవి, మండల ఏవో రాగమ్మ ఉన్నారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మీ-సేవ

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మే 29 (నమస్తే తెలంగాణ) : ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యాన్ని అధిగమించేందుకు మీ-సేవ వెబ్‌సైట్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందిస్తున్నదని రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కమిషనర్ ఈఎస్‌డీ రవికుమార్‌తో కలెక్టర్ కలిసి మీసేవా దరఖాస్తులను పరిష్కరించడంలో జాప్యం జరుగకుండా చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. మీ-సేవ వెబ్‌సైట్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా, మండల స్థాయిలో కుల, జనన, మరణ, ఆదాయ, కుటుంబ సభ్యుల ధృవీకరణ, రెసిడెన్సీ, ఇతర వెనుకబడిన తరగతుల ధ్రువీకరణ పత్రాల జారీ చేయుటలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ఈ నూతన విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో వచ్చిన అప్లికేషన్ల ఫీల్డ్ వెరిఫికేషన్‌ను పరిష్కరించడం వల్ల సకాలంలో పౌరులకు పత్రాలను అందించడం జరుగుతుందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల బ్లాంక్ పత్రాలు అప్‌లోడ్ చేసినట్లయితే వెబ్‌సైట్ తిరస్కరిస్తుందని తెలిపారు. సరైన పత్రాలను అప్‌లోడ్ చేస్తేనే తహసీల్దార్ల పరిశీలనకు వెళ్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ అనంతరం మండల స్థాయిలో తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఆపరేటర్లకు డివిజినల్ వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని అధిగమించేందుకు వీలవుతుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఈడీఎం నాగభూషణం, సంబంధిత అధికారులున్నారు.

మావిళ్ల వెంకటయ్య (ఫైల్)

అవయవదానంతో ప్రాణాలు నిలిపి..

పలువురి జీవితాల్లో వెలుగు నింపిన అన్నదాత

మన్సూరాబాద్, మే 29 : తాను మరణిస్తూ.. పలువురి జీవితాల్లో వెలుగులు నింపాడో అన్నదాత. నల్గొండ జిల్లా, చింతపల్లికి చెందిన మావిళ్ల వెంకటయ్య (34) వ్యవసాయం చేస్తుంటాడు. ఈ నెల 24న వెంకటయ్య బైకుపై చింతపల్లిలోని వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్తుండగా, భారీ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని.. చికిత్స కోసం ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానకు తరలించారు. ఐసీయూలో ఉంచి ఐదు రోజుల పాటు చికిత్స అందించినా.. ఆరోగ్యం కుదుటపడలేదు. వెంకటయ్య ఈ నెల 28న బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు వైద్యులు గుర్తించారు. విషయాన్ని తెలుసుకున్న జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు మృతుడి భార్య పార్వతమ్మతో పాటు కుటుంబసభ్యులను కలిసి అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో అవయవదానానికి వారు ముందుకురాగా, వెంకటయ్యకు చెందిన రెండు మూత్రపిండాలు, లివర్, రెండు కార్నియాలను దానం చేశారు.

గాయత్రి నర్సింగ్ హోమ్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్

గాయత్రి నర్సింగ్‌హోమ్ ఆకస్మిక తనిఖీ

సిజేరియన్ ప్రసవాలు జరగడానికి కారణాలు తెలుపాలని నోటీసులు జారీ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్

వికారాబాద్, మే 29 : వికారాబాద్‌లోని గాయత్రి నర్సింగ్ హోమ్ దవాఖానను వికారాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో నర్సింగ్ హోమ్‌లో జరిగే ప్రసవాలన్నీ సిజేరియనే జరిగినట్లుగా గుర్తించారు. పేషంట్ల కేస్ షీట్స్ కూడా అసంపూర్తిగా నమోదు చేసినట్లు తెలుసుకున్నారు. సిజేరియన్ ప్రసవం చేయడానికి గల కారణాలు కేసు షీట్‌లో స్పష్టంగా నమోదు చేయాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. దీనిపై నోటీసులు జారీ చేశారు. ముఖ్యంగా జిల్లా పరిధిలోని గైనకాలజిస్టులందరు కూడా కచ్చితంగా సాధారణ ప్రసవాలు జరిగేలా జాగ్రత్త వహించాలని, సిజేరియన్ ప్రసవాలను ప్రోత్సహించకూడదని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ ప్రసవాలు చేయాలని, పేషంట్ కేసు షీట్‌లో పూర్వ, ప్రస్తుత గర్భస్థ చరిత్ర, అలాగే ఆపరేషన్ థియేటర్ నోట్స్, చికిత్స, డిశ్చార్జ్ సమ్మరీ కచ్చితంగా నమోదు చేయాల్సి ఉందన్నారు. ఇండికేషన్స్ ఉన్నప్పుడు మాత్రమే సిజేరియన్ ఆపరేషన్లు చేయాలని, అనవసరంగా చేయకూడని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన గైనకాలజిస్ట్, ఆసుపత్రి యాజమాన్యంపై.. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆకస్మిక తనిఖీలో ఎంసీహెచ్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సాయిబాబా, డిప్యూటీ మాస్ మీడియా అధికారి తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ @40.2

సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): వానలతో మొన్నటి వరకు చల్లబడిన గ్రేటర్ వాతావరణం మళ్లీ ఒక్కసారిగా వేడెక్కింది. రెండు మూడు రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఏకంగా 40 డిగ్రీలు దాటి నమోదవుతుండటంతో పగటి పూట జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. కిందిస్థాయి గాలులు పశ్చిమ దిశ నుంచి తెలంగాణ వైపునకు వీస్తుండటంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి దాటి నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 40.2, కనిష్ఠం 27.3 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 32 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా జూన్ 1, 2 తేదీల్లో గ్రేటర్‌కు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

హరితహారం మొక్కలను జాగ్రత్తగా కాపాడాలి

రంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖాధికారి శ్రీలతారెడ్డి

కర్ణంగూడ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న శ్రీలతారెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, మే 29 : హరితహారంలో భాగంగా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను జాగ్రత్తగా కాపాడాలని రంగారెడ్డిజిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శ్రీలతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగన్‌పల్లి, కర్ణంగూడ గ్రామాల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీలతారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నర్సరీలో 11000 చొప్పున మొక్కలను పెంచడం జరుగుతుందన్నారు. వర్షాలు పడిన వెంటనే మొక్కలు నాటేందుకు అన్ని గ్రామాల్లో సిబ్బంది మొక్కలు నాటేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటేందుకు ఖాళీ స్థలాలు, పాఠశాలలు, కళాశాలలు, శ్మశానవాటికలతోపాటు ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద రైతులు తోటలు పెంచుకునేందుకు అవకాశం ఉందని.. పండ్లతోటలు పెంచుకోవాలనుకునే రైతులు పంచాయతీ కార్యదర్శులు లేదా ఉపాధి హామీ సిబ్బందిని కలిసి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్పతినాయక్, ఏపీవో తిరుపతాచారి, పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్ ఉన్నారు.

కర్ణంగూడలో స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్ కేంద్రాన్ని సందర్శించి యూనిఫాంను పరిశీలిస్తున్న పీడీ

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

కర్ణంగూడలో స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్ సెంటర్‌ను పరిశీలించిన డీఆర్‌డీవో శ్రీలత

ఇబ్రహీంపట్నంరూరల్, మే 29 : మహిళలు స్వశక్తితో ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు సంఘాల ద్వారా తోడ్పాటు నందిస్తున్నట్లు డీఆర్‌డీవో పీడీ శ్రీలతారెడ్డి అన్నారు. మండల పరిధి కర్ణంగూడ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న యూనిఫాం కుట్టుమిషన్ కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు సంబంధించిన యూనిఫాం స్టిచ్చింగ్ విధానంతో పాటు కటింగ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మహిళలకు ఉపాధి కల్పించడంతోపాటు ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుని మహిళలకు తోడ్పాటునందించడం ఎంతో అభినందనీయమన్నారు. మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కుట్టుమిషన్ కేంద్రాన్ని సందర్శించిన ఆమె మహిళలను అభినందించారు. కార్యక్రమంలో డీపీఎం నర్సింహ, ఏపీఎం రవీందర్, యూనిఫాం స్టిచ్చింగ్ సెంటర్ సీసీలు కృష్ణ, ఆనంద్, జంగమ్మ, రమాదేవి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ అధికారి శంకర్ నాయక్

అడ్మిషన్లు ప్రారంభం

జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్‌నాయక్

బొంరాస్‌పేట, మే 29 : ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి బొంరాస్‌పేటలోని జూనియర్ కళాశాలలో ప్రవేశాలను ప్రారంభిస్తున్నామని, పదో తరగతి పాసైన విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరాలని జిల్లా ఇంటర్మీయట్ అధికారి శంకర్ నాయక్ కోరారు. బుధవారం బొంరాస్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ అడ్మిషన్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మారుమూల విద్యార్థులు ఇంటర్ విద్య కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే విద్యను అభ్యసించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మండలానికి జూనియర్ కళాశాలను మంజూరు చేసిందని.. విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులలో అడ్మిషన్లు తీసుకుంటామన్నారు. ప్రాథమిక పాఠశాలలోని న